

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

# సంబరాల కన్నబాబు (కె.బీ)!

**కన్న బాబు అంటే ఎవరికీ తెలీదు.** కె.బీ అంటే అందరూ ఠక్కున గుర్తు పట్టేస్తారు. మరీ పొట్టీ, కాకుండా, బాగా పొడుగూ కాక మధ్యస్థంగా ఉంటాడు. అందరినీ తనని కె.బీ అనే పిలవమని ఖచ్చితంగా చెప్పేస్తాడు. అలా అంటే స్టైలుగా ఉంటుందిట. ఒకప్పుడు బాంక్‌లో పనిచేసేవాడుట. ఈ మధ్యనే రిటైరయిపోయాడు. ఎంత చమత్కారో, అంత మాటకారి. నల్లటి, కళగలిగిన ముఖంలో తెల్లగా మెరిసే చిరునవ్వు అతనికి పెట్టని ఆభరణం. ఎప్పుడూ మడత నలగని విస్త్రీ చొక్కా, తెల్లటి పాంటూ, మెడలో మెరిసే బంగారం గొలుసూ, చేతులకి నాలుగు ఉంగరాలు.

ఇలాంటి డాబుసరి వేషం చూసి ఊరిలో ఎవరేనా 'రోజూ ఇలాంటి హంగెందుకు కె.బీ?' అని అడిగితే. చల్లగా వెన్నెల్లా నవ్వేసి, " మనం ఊరిలో అందరికీ తెలుసు. అలాగని మాసిన పాంటూ, చొక్కా వేసుకుని తిరిగితే బావుంటుందా? ఫలానా కె.బీ అంటే, ఇలాగే ఉంటాడు అని అందరికీ ఠక్కున గుర్తు రావాలి కదా ! అందుకే " అంటాడు.

పై ఊరేదైనా వెళ్ళినా సరే అలాగే డాబుగా వెళతాడు. " కొత్తవారిముందర మనం గొప్పగా కనపడాలి.. లేకపోతే మన ఊరి పరువేమవ్వాలి ? " అంటాడు నవ్వుతూ. మడత నలగని బట్టలూ, మమతానురాగాల మానవత్వపు విలువలూ వెరసి కె.బీ. .

ఎప్పుడూ ఎవరో ఒకరి ఇంటిలో కనిపిస్తూనే ఉంటాడు. తన ఇంట్లో తనుండేది తక్కువ. చదువుకునే పిల్లల్ని తనింట్లో ట్యూబ్ లైటూ, టేబిల్ ఫానూ పెట్టి 'హాయిగా చదువుకోండ్రా!' అంటాడు. అప్పటికి ఊరిలో చాలామంది ఇళ్ళల్లో ఉన్నవి గుడ్డి దీపాలో, లేక అసలు దీపాలు లేకపోవడమో మూలంగా పిల్లలందరూ రాత్రి పూట లైటు కోసం అక్కడకి చేరితే, పొద్దున్న ఫాన్ కోసం చేరేవారు. ఎప్పుడూ ఇల్లు తాళం వెయ్యడం అన్నదే లేదు.

మంచిసరదా మనిషి 'ఒంటరిగాడిని, ఈ ఊరిలో పుట్టి పెరిగిన వాడిని, నావాళ్ళు కానివాళ్ళెవరు, నేనడిగితే కాదనే వారెవరు? ' అంటాడు నవ్వుతూ. నెలలో దాదాపు ఇరవై రోజులు ఆయన భోజనం ఎవరో ఒకరింట్లో అయిపోతూనే ఉంటుంది.

అతని తల్లితండ్రులు చిన్నతనానే పోయారు. అతనికి పదహారేళ్ళవయసులో పదేళ్ళ శ్రీలక్ష్మితో పెళ్ళి జరిగిందిట, కానీ అది జరిగిన రెండేళ్ళకి పిల్లకి విషజ్వరం వచ్చి సరి అయిన సమయానికి వైద్యం అందకపోవటంతో దూరమైపోయింది. అప్పటినించీ ఎందరు చెప్పినా సరే మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు, 'మనిషికి ఒకటే జన్మ, ఒకసారే పెళ్ళి' అంటాడుట ఎవరైనా పెద్దవాళ్ళు అడిగితే.

" నాకేం తక్కువండీ! హాయిగా ఉన్నాను. మీరందరూ నావాళ్ళు కాదూ! ఈ సంబరాల కన్నబాబుకి అందరూ చుట్టాలే " అంటాడు నవ్వుతూ..

ఉన్న ఒక్క అక్క (దొడ్డమ్మగారి అమ్మాయి) విజయనగరం సంగీత కళాశాలలో సంగీతం టీచర్ గా పనిచేస్తోంది. ఎప్పుడేనా వెళ్ళి ఓ నాలుగురోజులుండి వచ్చేస్తాడు. అక్కకి పూలూ, పళ్ళూ, పూతరేకులూ, ఉప్పాడ జరీ చీరలూ, పిల్లలకి జాంకాయలూ, నూపప్పు జీళ్ళూ పట్టుకుని వెళ్ళి. "నాదగ్గరే ఉండచ్చు కదరా! అంటుందండీ మా అక్క, కానీ ఆడపిల్లలింట్లో ఎన్నాళ్ళుంటామండీ? అందుకే చుట్టపుచూపుగా వెళ్ళి వచ్చేస్తూ ఉంటాను " అంటాడు.

ఎవరైనా తనవారే అనుకోవడం అతని ప్రత్యేకత. 'అవసరపడి అడిగినప్పుడు చెయ్యడంలో గొప్పలేదు. అవసరాన్ని కనిపెట్టి ఆదుకోవాలి' అన్నదాన్ని మనసారా నమ్ముతాడు. పెద్దవాళ్ళతో పేకాట ఎంత సరదాగా ఆడతాడో, చిన్నవాళ్ళతో బిళ్ళంగోడు, ఏడు పెంకులాట అలాగే ఆడతాడు. చిన్నపిల్లలందరినీ చేర్చి కథలెలా చెప్తాడో, ఆడపిల్లలతో సమానంగా గచ్చకాయలూ, చింత గింజలూ ఆడతాడు. కాలేజీ కుర్రాళ్ళతో చదరంగం ఆడుతూనే సినిమాల గురించీ, రాజకీయాల గురించీ చర్చిస్తాడు.

అతనికున్న సరదాలలో ముఖ్యంగా చెప్పుకోవలసినది. తెలుగు మాటలనీ, సినిమా పేర్లనీ ఇంగ్లీషులోకి తర్జుమా చేసి మాట్లాడుతుండడం.

" ఇందాకా గోపాలంగారి పనిమీద కొబ్బరి కొట్టుకెళ్ళానా? అక్కడ 'రైస్ పీస్ కింగ్' కనిపించాడు. మీకు మూడు బస్తాలు బియ్యం పంపాలట కదా.. చెప్పమన్నాడు రెండు రోజుల్లో పంపేస్తానని". అంటాడు అవధానిగారితో. 'రైస్ పీస్ కింగ్' ఎవరయ్యా?' అంటే అదే మన 'నూక రాజు' అంటాడు అమాయకంగా. .

"టెంపుల్ స్టెప్స్ గోల్డెన్ కింగ్ కనిపించాడా! వాళ్ళింట్లో సత్యనారాయణ వ్రతంట. భోజనానికి రమ్మన్నాడు, వెళుతున్నా "అంటాడు పట్టుపంచె సవరించుకుంటూ.

"గుడిమెట్ల బంగార్రాజింటోనా. నీ అసాధ్యం కూలా! గొప్ప పేరే పెట్టావు "అని నవ్వుతారు విన్నవారు.

అతనికి సినిమాలంటే మహా పిచ్చి. విడుదలైన ప్రతీ సినిమా మొదటి ఆట చూసొస్తే కాని అతనికి నిద్ర పట్టదు. "స్ట్రేంజ్ ఫామిలీ" సినిమా చూసాను, పరవాలేదు, సినిమా అని విచిత్ర కుటుంబం సినిమా చూసి వచ్చిన రోజు చెప్తే "గోల్డెన్ బాంగిల్స్, సినిమాలో సిస్టర్ సెంటిమెంటు" అని బంగారు గాజులు చూసిన రోజున చెప్పేవాడు.

అదొక్కటే కాదు తెలుగు సినిమా పాటలని ఇంగ్లీషులోకి తర్జుమా చెయ్యడం అంటే అతనికెంత ఇష్టమో చెప్పలేము. "లవ్వు లోఫ్ యూ పుట్టూ.:దిస్ పూర్ హార్ట్ యూ బ్రోకూ. మాడ్ ఫెలో బవుల్ లెస్ బెగ్గర్ యూ మేడూ." అని 'ప్రేమ భిక్ష నువ్వే పెట్టి

'అన్న పాటని అనువదిస్తే... ''స్లోలీ, స్లోలీ, స్లోలీ ఆటం, ఆటం ఈస్ యువర్సూ'' అని 'మెల్లమెల్లమెల్లగా. అణువణువూ నీదేగా' అని ఇంకో పాటనీ ఇలా సరదాగా పాడి అందరినీ నవ్విస్తూ ఉంటాడు.

ఊరిలో ఎవరికి ఎలాంటి చిక్కులొచ్చినా సలహాలిచ్చి, సమాధానాలు చెప్పడంలో ముందుంటాడు. ఓసారి పెద్దరుగుల వారింట్లో కొడుకు పెళ్ళికి చిన్న సమస్య వచ్చింది. అనుకున్న సమయానికి పంట డబ్బు చేతికి రాక, కోడలికి కొనవల్సిన బంగారం కొనడం కుదరలేదు.

'ఏం చేసి మాట దక్కించుకోవడమా?' అని తర్జన భర్జనలు పడుతున్నారు ఆయనా, భార్యానూ. ఇంతలో వచ్చిన అక్కడచేరిన కె.బి. '' ఇంతేనా అన్నయ్యగారూ!. వదినగారి మెడలోంచి ఒక నగ తీసి మార్పించో, మెరుగు పెట్టించో పిల్ల మెడలో వేసెయండి. మెడ మారుతుంది కానీ పిల్లా మనదే, బంగారమూ మనదే! డబ్బు వచ్చాక వదినగారికి మళ్ళీ కొనుక్కోవచ్చు'' అన్నాడు నింపాదిగా.

కుటుంబపు పరువే ప్రాణంగా బ్రతికే వారిద్దరూ '' అరే ఇంత చిన్న ఆలోచన మనకి రాలేదే? '' అని ఆశ్చర్యపోతూ అంత గొప్ప ఆలోచన చెప్పినందుకు సంబరపడిపోయారు. 'ఎలాగైనా కన్నబాబు బుర్రే వేరు 'అని.. 'కన్నబాబు కాదు, కె.బీ' అన్నాడు నవ్వుతూ.

పొద్దున్న ఒకరింట్లో పేపర్ చదువుతూ, కాఫీ తాగితే, మధ్యాహ్నం మరొకరితో కోర్ట్ పని చేయించి వచ్చి వాళ్ళింట్లో భోజనం కానిచ్చి, సాయంత్రం మరొకరి పిల్లని డాక్టర్ గారి దగ్గరకి ఇంజెక్షన్ కోసం తీసుకెళ్ళి, వాళ్ళింట్లో దింపేసి, వాళ్ళింట్లోనే ఫలహారం కానిచ్చి వచ్చేసి, ఇంట్లో ఓ గ్లాస్ నీళ్ళు తాగేసి పడుకునేవాడు. దాదాపు రోజూ ఇలానే సాగుతుంది అతని దినచర్య.

ప్రతీ ఆదివారం మాత్రం తన ఇంట్లో పెద్ద ఇనప మూకుడు పెట్టి దట్టంగా ఉల్లిపాయలూ, పచ్చిమిరపకాయలు వేసి పకోడీలు వేసి పిల్లలందరికీ పెట్టేవాడు. అగ్రహారంలో చాలా ఇళ్ళల్లో ఉల్లిపాయ నిషిద్దం కనక. లేకపోతే ఉల్లిపాయ, బంగాళాదుంపల వేపుడు వేసి వేడి వేడిగా అన్నం పెట్టేసి గప్‌చుప్‌గా పంపించేవాడు.

ఓ వైశాఖ మాసంలో శర్మగారి అమ్మాయి బంగారి పెళ్ళి ఆడంబరంగా జరుగుతోంది. పచ్చని పసిమి చాయలో, చెంపకు చారడంత కళ్ళతో, నల్లని బారెడు జడతో పోతపోసిన బంగారుతల్లిలా ఉంటుంది బంగారి. ఆ పిల్లంటే కె.బీ కి ప్రాణం. తన కూతురికన్న ఎక్కువగా చూసుకుంటాడు. లేక లేక పుట్టిన కూతురు, చిన్నతనంలోనే పెళ్ళి చెయ్యాలని శర్మగారి కోరిక, దానికి తగ్గట్టు పక్క ఊరిలోనే చక్కటి సంబంధం కుదిరింది. ఇంకేం, చాలా అట్టహాసంగా పెళ్ళి జరుగుతోంది. మూడు ఊళ్ళ జనాన్ని మూడురోజుల పాటూ భోజనాలకి పిలిచేసారు.

శనివారం పెళ్ళి లగ్నం నాటి రాత్రి. ఫలహారాలకి పూరీలూ, కూరా, ఉప్పుడుపిండి చేయించారు. భోజనాలవాళ్ళకి నవకాయ పిండివంటలతో భోజనాలు సిద్దం చేసారు. వంటలు బ్రహ్మాండంగా కుదరడంతో వచ్చినవాళ్ళు ఓ నాలుగు ముద్దలు ఎక్కువే తినడంతో, అనుకోకుండా వండిన అన్నం అయిపోయింది. ఇలాంటి పరిస్థితి వస్తే ఎదురు కోవడానికే ఎప్పుడూ గాడిపొయ్యి మీద ఎసరు మరిగిస్తూ ఉంటారు. బియ్యం కడిగి దాంట్లో వేసి వార్చేసి వడ్డించడానికి వీలుగా. కానైతే అదంతా పూర్తి అవడానికి ఎంత లేదన్నా పది, పదిహేను నిమిషాలు పడుతుంది. బూరెలు దేవుతూ, ఎసరు పెట్టడం కొద్దిగా ఆలస్యం చేసారు వంట కామయ్యగారు. అందువల్ల అది ఉడుకు పట్టి, అన్నం తయారయ్యేసరికి కొంత ఆలస్యం అయ్యేట్టుగా ఉంది. 'ఈ లోపున జనాలని ఆపడం ఎలా?అసలు విషయం తెలియకుండా చూసేదెలా?' అని రకరకాలుగా మధనపడుతున్నారు అతనూ, శర్మగారూనూ

.

అప్పుడు వచ్చాడు కె.బీ రంగంలోకి.. వంట బ్రాహ్మలకి చెవులో చకచకా ఏదో చెప్పాడు. వారు క్షణాల్లో సెనగపిండి కలిపారు. అప్పడాలు మధ్యకి విరిచి పిండిలో ముంచి నిమిషాల్లో బజ్జీలు వేసి బుట్టలకెత్తారు. బుట్ట పట్టుకుని కె.బీ వడ్డనకి బయలుదేరాడు. వెనకాల శీనుగాడిని లడ్డూలు, వెంకటాన్ని పులిహోర పట్టుకోమన్నాడు. పెద్ద గుండిగలో ఎసరు మరుగు పట్టింది అప్పటికి.

నేరుగా శర్మగారి వియ్యంకుడిగారిదగ్గరకి వెళ్ళి "బావగారూ! మొన్నామధ్యన వెంకట్రావ్‌గారింటో పనుండి బందరెళ్ళానా, అక్కడ చూసానీ బజ్జీలని. మనవైపెరగరీ అప్పడం బజ్జీలని. సరే బూరెలకెలాగా నూనె పెట్టారుకదా!, మనమూ వేసి చూస్తే పోలేదూ! మన బంగారుతల్లి పెళ్ళిలో అత్తవారికో కొత్త వంట రుచి చూపించినట్టుంటుంది, అని మన కామన్న గారిని అడిగానో, లేదో తక్షణం వేసేసాడు పాపం వెర్రి బ్రాహ్మడు. పనికి చూసుకోడు కదా!. ఎలా ఉన్నాయో రుచి చూడండి" అని అతనికీ , అలాగే మిగాతావారికీ తలో నాలుగేసి వడ్డించాడు.

"కారంగా, కరకరలాడుతున్న బజ్జీలు తిన్నాక నోట్లోకి తీపి వెళ్ళద్దూ! ఒరే శీనూ, లడ్డూలో, బూరెలో అందుకోరా?" అన్నాడు నవ్వుతూ. తీపి తర్వాత కారం అంటూ పులిహోర వడ్డించాడు.

"అమ్మమ్మా! మా శర్మ అన్నయ్యగారి వియ్యంకులంటే మా ఊరందరికీ ఆప్త బంధువులే మీరు" అంటూ ఆయనని మాటల్లో పెట్టాడు. ఆ మాటలు, కారాలూ, తీపీ కలిసి అన్నం వార్చాయి. అప్పుడు వేడి అన్నం పట్టుకుని పెరుగులోకి అన్నం అందరికీ వడ్డించాడు. కె.బీ మాటలకీ, శర్మగారి ఆతిధ్యానికి తృప్తిగా తిని "అన్నదాత సుఖీభవ" అని దీవిస్తూ చేతులు కడుక్కున్నారు అతిధులు.

మగపెళ్ళివారిదగ్గర , ఊరివారి దగ్గర మాట దక్కించినందుకు కన్నబాబు చేతులు పట్టుకున్నారు శర్మగారు.

"అదేం మాటండి? బంగారి మీకొక్కరికేనా, మన ఊరికే ఆడపిల్ల, నాకు మాత్రం కూతురుకాదూ! ఈ మాత్రానికే ఇంత ఇదైపోవాలా మీరు? భలేవారే? " అని నవ్వేసాడు.

సూర్నాణ, వెంకటేశ్వర్లూ అన్నతమ్ములు. ఎందుకొచ్చిందో ఆస్థి విషయంలో మాట పట్టింపు వచ్చి, తండ్రి పోయిన నాలుగోరోజునించీ ఇద్దరూ మాట్లాడుకోవడం మానేసారు. చక్కగా కలిసి ఉండే వాళ్ళు, మధ్యలో గోడలు కట్టేసుకుని వేరు కాపరాలు పెట్టేసుకుందామని నిర్ణయించేసుకున్నారు. ఈ ఆస్థి గొడవ తెలి, వేరుకాపరం పెట్టుకోవడానికే వస్తానని ఊరిలో ఉన్న అత్తగారింటికి వెళ్ళిపోయాడు తమ్ముడు వెంకట్రావ్.

వాళ్ళమ్మ వెంకాయమ్మగారు 'కొడుకులు ఇలాగైపోయారేమిటా?' అని ఒక కంటా, భర్త పోయినందుకు భగ్గుమన్న దు:ఖంతో మరొక కంటా కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. ఇద్దరూ కలిస్తేనే కానీ, మళ్ళీ మునుపటిలా ఉంటేనే కానీ తన భర్త ఆత్మ శాంతించదని ఆవిడ విశ్వాసం. ఇద్దరిలో ఏ ఒక్కరూ తగ్గేలా లేరు. "అంతగా అవసరం అయితే వాడినే మాట్లాడమను" అంటున్నారిద్దరూనూ. ఏం చెయ్యాలో తెలియలేదు. కన్నబాబుకి కబురు పెట్టి ఆవిడ అంత బాధలోనూ అతనికి సంగతంతా చెప్పింది.

" ఏం చేస్తావో, నువ్వే చెయ్యాలి. లేకపోతే ఆయన ఆత్మ ఇక్కడే తిరుగుతుంది" అని కళ్ళనీళ్ళతో తల్లడిల్లిపోయిన ఆ తల్లిని చూస్తే కన్నబాబు మనసు కరిగిపోయింది.

మర్నాడు మధ్యాహ్నం సూర్నాణ దగ్గరకెళ్ళాడు ముందు. "ఏం తమ్ముడూ, నాన్నగారి పనులెలా సాగుతున్నాయ్? " అన్నాడు. అతనేదో చెప్పేలోపే.. వెంకన్న కేమీ తోచడం లేదట, 'ఏ పనైనా అన్నయ్య తోడు లేనిదే చెయ్యలేదు.. ఇప్పుడెలాగో ఏవిటో, నాకు కాళ్ళు చేతులూ ఆడటం లేదు. అన్నయ్యనొకసారి రమ్మని చెప్పకూడదూ' అన్నాడు. మధ్యాహ్నం వెళ్ళకూడదూ!?" అన్నాడు.

"వాడు నిజంగానే రమ్మనన్నాడా? కుర్రవెధవ ఏం కష్టపడుతున్నాడో, సరేలే" అన్నాడు సూర్నాణ.

తర్వాత వెంకన్న దగ్గరకెళ్ళి "రామలక్ష్మణుల్లా అన్నీ కలిసి చేసేవాళ్ళం, నాన్నగారి కర్మకాండలకి ఇలా అయిపోయామేమిటి కన్నబాబు, చిన్నవాడు వాడికేం తెలుసు? ఓ సారి నాదగ్గరకి రమ్మని చెప్పకూడదూ అన్నాడయ్య మీ అన్నయ్య". అనగానే అప్పటివరకూ వెంకన్నలో ఉన్న బింకం సడలిపోయింది.

మధ్యాహ్నం తోటలో వాళ్ళిద్దరినీ కలిపాడు. కబురు పెట్టినదీ, చెప్పినదీ తనేనని మొదలుపెట్టి

"ఒరే అయ్యా! లేని వాడు లేరని ఏడిస్తే ఉన్న వాడు ఉన్నదాన్ని చూసుకోక ఏడిచాడుట. ఇన్నేళ్ళూ మీ ఇద్దరినీ చూసి, నాకిలాంటి అన్నో, తమ్ముడో లేడే అనుకున్నాను. మీరిద్దరూ విడిపోయి, పోయిన మీ నాన్ననే కాదు, ఉన్నవాళ్ళందరినీ ఎంత బాధపెడుతున్నారో మీకు తెలుస్తోందా? మీ అమ్మ దేనికి ఏడవాలో తెలియక తల్లడిల్లిపోతోంది.

మీ నాలుగుచేతులతో తుడవాల్సిన ఆ రెండు కళ్ళూ కన్నీటి కడవలైపోతున్నాయి. ఇదేన్రటా, మీరు నేర్చుకున్నది? ఈ ఆస్థి, పాస్థి మన వెంట వస్తుందా? ఉన్నదేదో ఉన్న నాలుగునాళ్ళు కలిసే తినండీ, తిరగండి. నాలాంటి వాడికి పెట్టండి. అంతే కాని ఇలా పంతాలకి పోయి ధర్మరాజులా బతికిన పెద్దాయన ప్రాణాన్ని బాధపెట్టకండి." అని ఇంకా ఏవేవో మనసుకు హత్తుకునేలా చెప్పాడు. అప్పటికే విడిపోవడం వల్ల పడుతున్న బాధ పైకి చూపించకుండా బింకంగా ఉన్న అన్నదమ్ములు ఆ మాటలవల్ల మళ్ళీ ఒక్కటయ్యారు. కలిసి అన్నీ జరిపించి అందరికీ సంతోషాన్ని కూర్చారు.

ఇలా ఒకటనేవిటి? సూది మందునించీ, శుభకార్యాలదాకా, స్కూల్ పిల్లలనించీ ఊరిపెద్దలదాకా తలలో నాలికలా ఉన్న కె.బీ ఒకనాడు పెట్టె పట్టుకుని ఊరెళుతూ అందరికీ చెప్పేసాడు. తను రాజమండ్రి వెళ్ళిపోతున్నానని.

"అదేమిటి? నీకెవ్వరూ లేరన్నావ్?" అంటే..

"లేరనే అనుకున్నాను ఇన్నాళ్ళూ, మా అక్కకీ తెలియదుట ఇప్పటివరకూ, కానీ ఈవిడ మాకు బాగా దూరపు చుట్టంట, సూరమ్మామ్మ అని, కొడుకు ఉద్యోగం పనిమీద దుబాయ్ వెళ్ళాడుట, ఈవిడకేమో ఉన్నట్టుండి దగ్గూ, ఆయాసంట. ఒక్కర్తీ నానా హైరానా పడుతోందిట. ఈ మధ్యనే అక్కకి ఎవరో ఈ విషయం చెప్పారుట, నిన్ననే ఉత్తరం రాసింది. పాపం మామ్మ దగ్గరుండి, ఆవిడ కొడుకు రాగానే, కాస్త తగ్గగానే వచ్చేస్తాను ఎంత ఇబ్బంది పడుతోందో! ఏవిటో! "అన్నాడు

'కొడుకు తిరిగి రావడమో, ఆవిడకి తగ్గడమో ఏది ముందు జరిగితే అది అవగానే తప్పకుండా వెనక్కి వచ్చేస్తాను' అని నమ్మకంగా చెపి సూర్యుని వేడికి కరిగిపోయే పుష్యమాసపు మంచులా మాయమయి పోయాడు.

దాంతో ఊరంతా స్థంభించిపోయినట్టయిపోయింది. సూర్యకాంతంగారిని సూదిమందుకు తీసుకువెళ్ళేవారు లేరు. బంగారి సీమంతానికి వడ్డిస్తూ సందడి చేసేవారు లేరు. పిల్లలకి ఉల్లిపాయ పకోడీలు పెట్టేవారు లేరు. దేవుడి దయవల్ల అన్నదమ్ముల మధ్యన గొడవ మళ్ళీ రాలేదు కానీ వస్తే నేర్పుగా తీర్చేవారూ లేరు.

ఇలా ఆ ఒక్క మనిషి లేకపోయేసరికి ఊరంతా రాత్రయేసరికి ముడుచుకు పోయే నిద్రగన్నేరులా మారిపోయింది. 'సూరమ్మమ్మకి తగ్గింది, కన్నబాబు అదే కె.బీ మళ్ళీ వచ్చేస్తున్నాడు' అన్న కబురు ఎప్పుడు వస్తుందా ?అని ఎదురుచూపులు చూస్తున్నారు.

'అందరికోసం బ్రతికేవాడు ఒక్కడే ఉన్నా ఒంటరివాడు కాదు, ఎందరున్నా తన బ్రతుకు మాత్రమే తను బ్రతికే వాడే నిజంగా ఒంటరివాడు.. కె.బీ అందరికీ బంధువే.. మనవాడే. ఎప్పుడొస్తాడో' అనుకుంటూ అతని రాకకోసం వేచి ఉన్నారు ఊరిజనం.

Click here to share your comments on this article